

సోమశిలలో 46.370 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 46.370 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 4,300, ఉత్తర, దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,230
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,720
3శాతం జీఎస్టీతో	రూ.8,982
నవర (8గ్రా)	రూ.71,856

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.6 /28.6

సోమవారం ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 52 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం అడ్డగింత

కొండాపురం: మర్రిగుంట గ్రామస్తులు శనివారం రాత్రి 2 గంటల సమయంలో 70 బస్తాల రేషన్ బియ్యాన్ని మినీ టాటా బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్నారు. వెంటనే కొండాపురం పోలీసులకు సమాచారం తెలుపగా వారు వచ్చి బియ్యం ఉన్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం బస్తాలను జలదంకి మండలానికి చెందిన కూరపాటి బ్రహ్మేశ్వరరెడ్డి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. సివిల్ సప్లయి అధికారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పుర మందిరం (టౌన్‌హాలు) ప్రాంగణంలోని వర్ధమాన సమాజంలో పెన్షనర్ల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, పి.వెంకయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ పెండింగ్ సమస్యలు గురించి చర్చిస్తామని తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

దొంగతనానికి వెళ్లి ఏసీ ఆన్‌చేసి సేదతీరి..

- ఆపై బంగారు, వెండి, నగదు చోరీ
- పొదలకూరులో ఘటన

పొదలకూరు: దొంగలు వస్తువులను అపహరించేందుకు ఓ ఇంట్లోకి ఏసీ ఆన్ చేసి సేదతీరారు. తీరిగ్గా బంగారం, వెండి వస్తువులు, నగదు చోరీ చేసి వెళ్లిపోయారు. ఈ ఘటన పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లో జరిగింది. ఇంటి యజమాని ఆదివారం దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల కథనం మేరకు.. కొడవలూరు మండలానికి చెందిన రమేష్ అనే వ్యక్తి మూడు సంవత్సరాలుగా పొదలకూరులోని సత్యనారాయణ లేఅవుట్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో ఈనెల 4వ తేదీన భార్యాబిడ్డలతో కలిసి సొంతూరికి వెళ్లాడు. దొంగతనం ఎప్పుడు జరిగిందో తెలియదు గానీ ఆగంతకులు ఇంటి తలుపు తాళం పగులగొట్టి లోనికివెళ్లి ఏసీ ఆన్ చేసుకుని మరీ చాలా సమయం గడిపినట్టు తెలుస్తోంది. ఒక కేజీ వెండి, 2.5 సవర్ల బంగారు నగలు, రూ.22 వేలు నగదును అపహరించారు. ఇంటి వెనుక వైపు నుంచి వచ్చిన దొంగలు తిరిగి అక్కడి నుంచే కుర్చీ వేసుకుని గోడెక్కి దర్జాగా వెళ్లిపోయారు. ఏసీ ఆన్‌లో ఉండటాన్ని స్థానికులు ఆదివారం గమనించారు. తలుపు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని గుర్తించి రమేష్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో ఇటీవల వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కండలేరులో 43.420 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 43.420 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,620, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఓపెన్ చెస్ టోర్నీ ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను ఫన్ పార్క్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి హాజరయ్యారు. జేసీఐ టౌన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్, ఫన్ పార్క్ ఎండీ పాత్తూరు సాయి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంయుక్త, జేసీఐ జోన్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్, కార్యదర్శి నాగార్జున, గోపీనాథ్, కోచ్‌లు మధురెడ్డి, సుమంత్, ఆర్బిటర్లు హుస్సేన్, రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



జాతీయ జెండాను ప్రదర్శిస్తూ..



ర్యాలీలో పాల్గొన్న నగర ప్రజలు

నగరంలో వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ విగ్రహం వరకు ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ముష్కరుల పీచమణిచిన భారత ప్రధానికి, సైన్యానికి దేశప్రజలు అండగా ఉండాలన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం చాటిన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల జవానులు అనిర్వచనీయమైన విజయం సాధించారని కొనియాడారు. – నెల్లూరు సిటీ

ప్రకృతి సోయగం... కనుమరుగు కానుందా..?



ఈ ఫొటోను జాగ్రత్తగా భద్రపరుచుకోండి. ఎందుకంటే కొన్నాళ్లకు ఈ ప్రకృతి సోయగం చూడాలన్నా కనిపించదు. తూర్పు కనుమలలో భాగమై.. ప్రకృతి అందాలతో వన్యప్రాణులకు ఆలవాలమై హరిత హారాన్ని తలపించే సంగం కొండ రాజకీయ నేతల చేతుల్లో పడి డొల్లగా మారనుంది. ప్రతి నిత్యం బస్సుల్లో, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారికి సుందరంగా కనిపించే సంగం కొండ కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. గతంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి నిర్మాణంతో ఈ కొండను రెండుగా విడదీసి ప్రజలకు దారిని దగ్గర చేసిన పాలకులు ప్రస్తుతం కొండ మీదనే క్వారీకి అనుమతులిచ్చి ప్రకృతి సోయగాన్ని పాడుచేసే పనికి పూనుకుంటున్నారు. వన్యప్రాణులకు, కొండ దిగువన ఉన్న ప్రజలకు ఇబ్బందులు కలిగించనున్నారు. – సంగం

టీడీపీ నేతల భూ బాగోతం



కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల భూదందాలు మితిమీరాయి. ఏకంగా రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వ భూములను కాజేస్తున్నారు. టీడీపీ నేతల కుటుంబ సభ్యుల పేర్లతో వందల ఎకరాలు రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించారంటే ఏ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

చుంచులూరులో 80 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణ

- రెవెన్యూ అధికారుల సహకారం
- వెబ్‌ల్యాండ్‌లో ఇష్టారాజ్యంగా మార్పులు
- దాంతో గ్రామ వాస్తవ సాగు విస్తీర్ణానికి, రికార్డులలోని లెక్కలకు తేడా
- అల్లంపాడు గ్రామంలోనూ అక్రమాలు



చుంచులూరు రెవెన్యూ పరిధిలో టీడీపీ నేత ఆక్రమణలోని భూముల్లో జామాయిల్ చెట్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మర్రిపాడు మండలం చుంచులూరు చిన్న గ్రామం. ఇక్కడ 2700 జనాభా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.1,600 కోట్ల వ్యయంతో 5 టీఎంసీల నీటిని మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండలంలో సాగు నీటి సరఫరా కోసం దివంగత సీఎం రాజశేఖరరెడ్డి సోమశిల హైలెవల్ కెనాల్ మంజూరు చేశారు. అప్పటి మంత్రి ఆనంతోపాటు మేకపాటి సోదరులు ఆ ప్రాజెక్టు మంజూరులో కీలకంగా వ్యవహరించారు. మొదటి విడతలో పొంగూరు, పీఎస్‌పల్లి పరిధిలో ఒక్కో గ్రామంలో టీఎంసీ నీరు స్టోరేజ్ చేసేందుకు గాను ట్యాంకు నిర్మాణాలు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న భూములను సేకరించే ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే పీఎస్‌పల్లి ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన భూములు చుంచులూరు రెవెన్యూ పరిధిలో ఉండడంతో ఆయా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఆ భూసేకరణ టీడీపీ పాలన 2014–19లో జరిగింది. అప్పట్లో ఎకరాకు రూ.6 లక్షల వరకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఆ గ్రామ టీడీపీ నేతలకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూములపై కన్నుపడింది. రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించి పరిహారం తీసుకునేందుకు స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులు మార్చేసి పరిహారం తీసుకున్నారు.

రూ.20 కోట్ల విలువైన భూముల కబ్జా

చుంచులూరుకు చెందిన టీడీపీ నేతతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ఆయన సోదరుడు ఇందులో కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు. రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 169/1, 171, 8, 37/1, 119/2, 17–1, 492–2, 435–1, 435–2, 494–2, 501–2, 502–2, 505–పీ, 506, 583లో ఉన్న దాదాపు 80 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. వెబ్‌ల్యాండ్ అడంగళ్‌లో ఆ ఇద్దరు కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయించారు. అవేకాదు అల్లంపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న 447–1448/1 సర్వే నంబర్లలో ఉన్న భూములు కొట్టేశారు. ఆ సర్వే నంబర్లలో వెబ్ అడంగళ్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. చుంచులూరులో ప్రస్తుతం మూడు నేషనల్ హైవే నిర్మాణాలు పూర్తయి ప్రారంభం కావడంతో ఆ ప్రాంతంలో భూముల విలువలు అమాంతం పెరిగాయి. హైవేకు అనుకుని మార్కెట్ విలువ ఎకరా రూ.50 లక్షలు పలుకుతోంది. సదరు టీడీపీ నేతల భూ ఆక్రమణలు అధిక భాగం నేషనల్‌హైవే పక్క భూములే కావడం గమనార్హం.

ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం

చుంచులూరు రెవెన్యూ రికార్డుల్లో మాయాజాలం జరిగింది వాస్తవమే. కానీ రీసర్వే జరిగి ఉంటే రికార్డులు సరిచేసే వాళ్లం. రీసర్వే జరగకపోవడంతో మార్పులు చేసేందుకు గాను నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాము. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీరు, మర్రిపాడు

ప్రభుత్వ భూమికి పరిహారం

సోమశిల హైలెవల్ కెనాల్ భూసేకరణలో భాగంగా సదరు టీడీపీ నేత సోదరుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు 501–2 సర్వే నంబర్‌లో ఉన్న 2.77 ఎకరాల ప్రభుత్వ భూమికి గాను రూ.16 లక్షల పరిహారం తీసుకున్నారు. రెవెన్యూ రికార్డులు మార్చి తన కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయించి ఫేక్ డీఫారం పట్టాతో పరిహారం అందుకున్నారు. ఇందులో రెవెన్యూ అధికారులకు కూడా వాటా ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

వాస్తవానికి, రెవెన్యూ రికార్డులకు తేడా

చుంచులూరు గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం (ఆర్ఎస్ఆర్) సాగు భూమి వాస్తవ విస్తీర్ణం 4020.81 ఎకరాలు ఉంది. కానీ రెవెన్యూ అధికారులు స్థానిక టీడీపీ నేతలతో కలిసి రెవెన్యూ రికార్డులనే మార్చేశారు. దాంతో వెబ్‌ల్యాండ్ అడంగళ్‌లో 8326.56 ఎకరాలు ఉన్నట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. అంటే సాగుకు నోచని ప్రభుత్వ భూములను కూడా టీడీపీ నేతలు సాగు భూములుగా నమోదు చేయించుకుని పరిహారం పొందారని అర్థమవుతోంది.

ఆక్రమిత భూమిలోనే భారీ భవంతి



చుంచులూరులో ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవంతి

ఉపాధ్యాయుడైన టీడీపీ నేత సోదరుడు ప్రభుత్వ భూమి ఆక్రమించడంతో పాటు ఆ భూముల్లోనే భారీ భవంతి నిర్మించాడు. సర్వే నంబర్ 140లో ఉన్న 6.66 ఎకరాలు ఆక్రమించి అందులో భవంతి నిర్మించాడు. గతంలో స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి రమణయ్య ఈ ఆక్రమణను గుర్తించి ఆ భూమి ప్రభుత్వానికి చెందినదిగా బోర్డు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేత ఆ వీఆర్‌ఓను సస్పెండ్ చేయించారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- సోమ, మంగళవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసి
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్
- హాజరుకానున్న 11,520 మంది విద్యార్థులు
- జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు (టౌన్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించనున్న ఏపీఈఏపీ పరీక్ష సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సోమ, మంగళవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనున్నాయి. ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,520 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, ఆయాన్ డిజిటల్ సెంటరులో పరీక్షలను నిర్వహించనున్నారు. ఏపీ ఈఏపీ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఆయా సెంటర్లు ముఖ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్‌తో క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరుతో పాటు థంబ్ వేయాల్సి ఉంటుంది.

ఇవి తప్పనిసరి...

- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కొన్ని పత్రాలను తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రింట్ తీసుకున్న కాపీలో విద్యార్థి కలర్‌సైజ్ ఫొటోను అతికించి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌తో సంతకం చేయించుకోవాల్సి ఉంది.
- పరీక్షకు వెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టిక్కెట్‌ను తీసుకువెళ్లాలి. బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను కేంద్రంలోకి అనుమతిస్తారు. గుర్తింపు కోసం పాస్‌పోర్ట్, పాన్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ తదితర వాటిల్లో ఏదో ఒక ఒరిజనల్ కార్డును తీసుకెళ్లాలి.
- ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్ తదితర వాటిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

- కొనియాడిన కలెక్టర్ ఆనంద్, మంత్రి నారాయణ
- సింహపురిలో ఘనంగా 125వ జయంత్యుత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(బృందావనం): తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగువారి మదిలో చిరంజీవి అని పలువురు వక్తలు కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం – అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్టోన్‌హౌస్‌పేట అరుణాచలం వీధిలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవ సభ జరిగింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో గాంధీజీ అడుగుజాడల్లో నడిచిన అమరజీవి దళితుల ఆలయ ప్రవేశం కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటం అనన్య సామాన్యమైందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో అమరజీవి 58 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. నెల్లూరు నగరంలోని 9వ డివిజన్‌లో కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు మార్కెట్ డెవలప్ చేస్తున్నామన్నారు. దీనికి అమరజీవి పొట్టి శ్రీరాములు మార్కెట్ పేరు పెడతామన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎనలేనిదన్నారు. కేరళీయుడినైన తనకు తెలిసిన ఒకే ఒక తెలుగు వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములని అందుకు నాడు ఆయన చేసిన త్యాగమే కారణమని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ మాట్లాడుతూ అమరజీవి త్యాగనిరతిని ఘనంగా శ్లాఘించారు. కార్యక్రమ పర్యవేక్షకులు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం మాట్లాడుతూ అమరజీవి త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకం, చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, బీజేపీ నేత పి.సురేందర్‌రెడ్డి, జనసేన నాయకుడు గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర, జిల్లా నేతలు భవనాసి సురేష్, దరిశి హరికృష్ణ, ఎం.పి.ఆంజనేయులు, కోట సత్యనారాయణ, గాదంశెట్టి హేమంత్, ఎం.బ్రహ్మంగుప్తా, ఎ.చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులపై చిన్నచూపా?

- ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోదా..
- 21వ రోజుకు చేరుకున్న సీహెచ్‌ఓల నిరసన



ఆందోళనలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

నెల్లూరు(అర్బన్): మహిళా ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీహెచ్‌ఓఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి రుబికా అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు చేస్తున్న నిరసన దీక్షలు 21వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం అయినప్పటికీ తమ భవిష్యత్తు కోసం చిన్న బిడ్డలను వదిలి ఇక్కడ ఆందోళనలో పాల్గొంటున్నామన్నారు. అధికారులకు, పాలకులకు ఎన్ని దఫాలుగా అర్జీలు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతోనే సమ్మె బాట పట్టామన్నారు. మహిళా ఉద్యోగులమనే కనికరం కూడా లేకుండా కూటమి ప్రభుత్వం తమను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రజల చెంతకు ఆరోగ్యం అందించేందుకు తమ సమస్యలైన పీఎఫ్ పునరుద్ధరణ, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాల పెంపు, పెండింగ్ బకాయిల విడుదల, మందులు, పరికరాలు తదితర వాటిని తరలించేందుకు అవసరమైన రవాణా చార్జీలు ఇవ్వడం తదితర వాటిని పరిష్కరించాలన్నారు. అంతవరకు ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, కోఆర్డినేటర్ ఆదిల్, స్వాతి, చంద్రకళ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా ధ్వజారోహణ



ధ్వజారోహణను నిర్వహిస్తున్న ఆలయ పండితులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో ఉన్న మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ధ్వజారోహణను వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతిపూజ చేశారు. ఆలయ వేదపండితులు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ పూజలు చేశారు. సంతానం కోసం మహిళలు కొడిముద్దలను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. తాగునీరు, మజ్జిగ చలివేంద్రం, ఉచిత ప్రసాద వితరణ, అన్నప్రసాదం పంపిణీ తదితర ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయ

నెల్లూరు(అర్బన్): అధిక రక్తపోటును నివారించేందుకు ఒత్తిడిని అధిగమించాలని, ప్రశాంతంగా ఉండే అలవాటు చేసుకోవాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ అన్నారు. రోటరీ క్లబ్ భాగస్వామ్యంతో రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో చెక్ బీపీ, స్టాప్ స్ట్రోక్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ హైబీపీ వల్ల మెదడులో రక్తం గడ్డకట్టడం, రక్తస్రావం లాంటివి జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులను నివారించాలంటే బీపీని నియంత్రించాలని చెప్పారు. మానసిక ఆందోళనలు తగ్గించుకోవాలని, తగినంత విశ్రాంతి అవసరమన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.సుజాత మాట్లాడుతూ అధిక ఉప్పుతో కూడిన జంక్ ఫుడ్, బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆయిల్ ఫుడ్ తగ్గించుకోవాలన్నారు. ఆకుకూరలు, గింజలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటు చేసిన మొబైల్ బీపీ చెకప్ బస్సును ప్రారంభించారు. హాజరైన వారికి ఉచిత బీపీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జనార్దనరాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, సభ్యులు రవిప్రకాష్, రాజేంద్రప్రసాద్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ చంద్రగిరి అజయ్‌బాబు, శ్రీహరిరెడ్డి, న్యూరో సర్జన్ డా.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని బాలాజీ నగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇస్తామని నమ్మించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సంవత్సరమవుతున్నా జిల్లాకు ఒక్క పరిశ్రమ రాలేదన్నారు. కృష్ణపట్నంలోని కంటైనర్ టెర్మినల్ చెన్నైకి పోవడంతో ఉపాధి అవకాశాలు లేక జిల్లాకు చెందిన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దానిని తిరిగి తీసుకొచ్చే విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు మాటలకే పరిమితమయ్యారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపించారు. జిల్లాకు పరిశ్రమలు వస్తాయని వేలాది ఎకరాల భూసేకరణ చేపట్టారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా ఇలాంటి నిర్ణయాలు చేస్తోందని ఆరోపించారు. గతంలో పారిశ్రామికంగా 15వ స్థానంలో ఉన్న జిల్లా నేడు 20వ స్థానానికి పడిపోయిందన్నారు. ఎంతోమంది ఉన్నత విద్య చదివి ఉద్యోగాల్లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో కృష్ణపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ కమిటీ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 135
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 268
లేయర్ చికెన్ : 187



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.45
పండ్లు : రూ.25



రక్తదానం ఎంతో గొప్పది



రక్తమే ప్రాణం, రక్తదానమే ప్రాణదానం, అన్ని దానాల్లో రక్తదానం మిన్న అంటూ అవగాహన కల్పిస్తున్నారు రెడ్‌క్రాస్ వలంటీర్ అరిగల రాంబాబు. సైకిల్‌పై వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు వివరిస్తున్నారు.

పనిలో తోడుగా..



ఓ మహిళ రిక్షాపై తిరుగుతూ రంగురంగుల ముగ్గు పిండి అమ్ముతోంది. మరో వ్యక్తి మోపెడ్‌పై తిరుగుతూ విక్రయాలు సాగిస్తున్నాడు. ఆమె రిక్షా తొక్కలేక ఇబ్బంది పడుతుండగా అతను వాహనాన్ని కాలితో నెడుతుండగా నెల్లూరులో తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ప్రమాదకరంగా..



తీవ్రమైన గాలి కారణంగా నెల్లూరు ముత్తుకూరు గేటు సెంటర్‌లో హోర్డింగ్‌పై ఉన్న భారీ ఫ్లెక్సీ చినిగిపోయింది. ఈ ప్రాంతంలో వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఫ్లెక్సీ వారిపై పడే ప్రమాదముంది. అయినా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు.

21న డీఈఓ కార్యాలయ ముట్టడి

- అసంబద్ధ విధానాలను విడనాడాలి
- ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నెల్లూరు(టౌన్): విద్యారంగంలో సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 21వ తేదీన డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. ఆదివారం నెల్లూరులోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలచారి ఆధ్వర్యంలో 16 ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23న కమిషనరేట్‌ను ముట్టడించనున్నట్లు వెల్లడించారు. 45 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో సెక్షన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 41 వద్ద 3వ పోస్టు ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టులను బ్లాక్ చేయడం తగదని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించి ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి అమలు చేయాలన్నారు. రేషనలైజేషన్‌లో సీనియర్ విల్లింగ్ ఇస్తే పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని చెప్పారు. ప్రతి ఏడాది రేషన్ లైజేషన్ ప్రక్రియ లేకుండా చూడాలన్నారు. ఎంఈఓలకు బదిలీలు నిర్వహించాలన్నారు.

జిల్లా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

ఉపాధ్యాయ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సభ్యులుగా సురేంద్రరెడ్డి (ఏపీటీఎఫ్ 1938), అనిల్ కుమార్ (అపస్), చలపతిశర్మ (యూటీఎఫ్), నరసింహం (ఎస్టీయూ), దశరథరాములు (ఏపీటీఎఫ్ 251), అజయ్‌కుమార్ (పీఆర్టీయూ), మధుసూదనరావు (ఆప్టా), భాస్కర్‌రెడ్డి (ఏపీ హెచ్ఎంఏ), శివశంకరరెడ్డి (వైఎస్సార్‌టీఏ), ప్రసాద్ (బీటీఏ), సురేష్ (పీటీఏ), మస్తాన్ (ఎంటీఏ), పద్మజ (మహిళా టీచర్స్ అసోసియేషన్), ఖాజారహంతుల్లా (ఆర్టీఏ), ధనరాజ్ (ఏపీసీపీఎస్ఈఏ)లను నియమించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నవకోటేశ్వరరావు, పిచ్చిబాబు, శేషు, అనిల్‌కుమార్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, మునీర్, అన్నం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అలా తిరుగుతూ.. జనావాసాల్లోకి..

- కొండికందుకూరులో నెమళ్ల సంచారం
- నరిశెట్టివారిపాళెంలో జింకలు
- హాని తలపెట్టొద్దంటున్న అటవీ శాఖ అధికారులు



చెట్ల కింద సేదతీరుతున్న నెమళ్లు

కందుకూరు రూరల్: అడవిలో ఉండాల్సిన నెమళ్లు జన సంచారంలోకి వచ్చాయి. మండలంలోని కొండికందుకూరు గౌతమ్ నగర్‌లో రెండు నెమళ్లు తిరుగుతున్నాయి. వీటిని చూసేందుకు గ్రామస్తులు ఉత్సాహం చూపుతున్నారు. జాతీయ పక్షి ఊర్లోకి రావడంతో పిల్లలు వాటిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అవి ఎక్కడి నుంచి వచ్చాయో తెలియడం లేదు. నెమళ్లు వచ్చాయని స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. వాటికి ఎలాంటి హానీ తలపెట్టొద్దని, స్వేచ్ఛగా తిరుగుతూ వెళ్లిపోతాయని అటవీశాఖాధికారి కె.సురేష్ తెలిపారు. గ్రామస్తులకు వీటి గురించి తెలియజేస్తామని ఆయన తెలిపారు. అలాగే కొండికందుకూరులోని గౌతమ్ నగర్‌కు సమీపంలో ఉన్న నరిశెట్టివారిపాళెం గ్రామ పరిసర ప్రాంతాల్లో జింకలు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబున్నారు. పొలాల్లో తిరుగుతున్నాయని పశుపోషకులు, గొర్రెల కాపర్లు వెల్లడించారు. జంతువులు, పక్షులకు హాని తలపెట్టకుండా ఉండేందుకు గ్రామస్తులకు అటవీ శాఖాధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.

ఆపే దమ్ముందా..



వింజమూరు బైపాస్‌లో ఇసుక తరలిస్తున్న టిప్పర్

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు సంగం మండలంలో పెన్నానది నుంచి పెద్ద సంఖ్యలో టిప్పర్లలో అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. నెల్లూరుపాళెం – వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, సంగం – కలిగిరి రోడ్డు మార్గంలో 20 నుంచి 25 టన్నుల లోడ్‌తో మాత్రమే వెళ్లాల్సి ఉన్నా 40 టన్నుల ఓవర్ లోడ్‌తో తిరుగుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. నెలవారీ మామూళ్ల వల్ల పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. అదే విధంగా గణేశ్వరపురం క్వార్ట్జ్ మైన్ నుంచి అధిక లోడ్‌తో టిప్పర్లు తెల్లరాయిని వింజమూరు మీదుగా నెల్లూరుకు రవాణా చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇటీవల వేసిన రోడ్డు దెబ్బతింటోంది. వర్షాలు కురిస్తే రోడ్డు కుంగే ప్రమాదం ఉంది.

నేటి నుంచి పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- 38 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 5,422 మంది విద్యార్థులు

నెల్లూరు(టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 28వ తేదీ వరకు వీటిని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ 4,863 మంది, ప్రైవేట్ 559 మంది కలిపి మొత్తం 5,422 మంది హాజరుకానున్నారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుంది. విద్యార్థులను గంట ముందుగానే కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఎగ్జామ్స్‌ను పక్కాగా నిర్వహించేందుకు 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 38 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 280 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను 22 స్టోరేజీ పాయింట్లలో భద్రపరిచారు. పరీక్ష రోజు వాటిని కేంద్రాలకు తీసుకెళ్లనున్నారు. కాగా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీపంలోని జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్లను మూసి వేయించనున్నారు. కేంద్రాల్లో ఏఎన్ఎం ఉంటారు. తాగునీరు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంటాయి.

పది, ఇంటర్ ఓపెన్ స్కూల్..

ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో పదో తరగతికి 12, ఇంటర్‌కు 6 సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షలు 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. పదికి 745 మంది, ఇంటర్‌కు 949 మంది కలిపి మొత్తం 1,694 మంది అభ్యాసకులు హాజరుకానున్నారు. పదికి 12 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇంటర్‌కు ఆరుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఆరుగురు డిపార్ట్‌మెంట్ అధికారులు, 160 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎగ్జామ్స్‌ను డీఈఓ బాలాజీరావు పర్యవేక్షించనున్నారు.

ప్రశాంతంగా 'జేఈఈ అడ్వాన్స్‌డ్'



పరీక్ష కేంద్రం సమీపంలో ఇలా..



పిల్లల కోసం ఎదురుచూస్తూ..

నెల్లూరు(టౌన్): ఐఐటీల్లో ప్రవేశం కోసం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జిల్లాలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్షను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. ఈ సమయంలో వారిని పరిశీలించారు. విద్యార్థులతోపాటు వచ్చిన తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు సాయంత్రం పరీక్ష ముగిసే వరకు కేంద్రాల వద్దే పడిగాపులు కాశారు.

చెట్టును ఢీకొన్న బైక్

- యువకుడికి గాయాలు

పొదలకూరు: మండలంలోని సోమశిల మార్గం కనుపర్తి క్రాస్‌రోడ్డుకు సమీపంలో ఆదివారం మోటార్‌బైక్ చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన మోహన్ గూడూరులో ఉంటూ ఏసీలు రిపేరు చేస్తుంటాడు. మండలంలోని నావూరులో ఏసీ రిపేర్ చేసి తిరిగి గూడూరుకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో చెట్టును ఢీకొట్టడంతో యువకుడి కాలు విరిగింది. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. సిబ్బంది పొదలకూరు సీహెచ్‌సీకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

వ్యక్తిపై దాడి

- కేసు నమోదు

చిల్లకూరు: మండలంలోని బల్లవోలు గ్రామంలో వ్యక్తిపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారి కథనం మేరకు.. బల్లవోలుకు చెందిన గౌతమ్, మరికొందరు కలిసి గ్రామ సమీపంలో పార్టీ చేసుకుంటున్నారు. ఆ ప్రాంతంలో చేపల వేట సాగిస్తున్న గిరిజనులతో వాగ్వాదానికి దిగడంతోపాటు దాడికి దిగారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాకువారిపాళేనికి చెందిన శీను అనే వ్యక్తి అడ్డుకున్నాడు. దీంతో మరింత రెచ్చిన గౌతమ్‌తోపాటు మరికొందరు అతడిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శీను గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని గౌతమ్‌తోపాటుగా పలువురిపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన వారిని త్వరలోనే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తితో అకారణంగా గొడవ పెట్టుకుని అతడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నెల్లూరులోని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ గాంధీనగర్‌కు చెందిన హనుమంతు ఐదేళ్లుగా చెన్నై పల్లవరం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతను ఈనెల 16వ తేదీన వరుసకు తమ్ముడైన తిమ్మయ్యతో కలిసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. హనుమంత్ అనారోగ్యానికి గురవడంతో నెల్లూరులో రైలు దిగి ఆత్మకూరు బస్టాండ్ వద్దకు చేరుకున్నాడు. సమీపంలో మందులు కొనుక్కుని బస్సు కోసం బస్టాండ్ వద్ద వేచి ఉండగా మద్యం మత్తులో ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అకారణంగా అతడితో గొడవ పెట్టుకున్నారు. వారు బండరాళ్లతో విచక్షణారహితంగా హనుమంత్‌పై దాడి చేశారు. బాధితుడు చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్లో చేరాడు. నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో సిబ్బంది సాంకేతికత ఆధారంగా నిందితులు వేదాయపాళెం జర్నలిస్ట్ కాలనీకి చెందిన బి.గగన్ కుమార్, చంద్రమౌళినగర్‌కు చెందిన ఎం.అన్వేష్‌గా గుర్తించారు. ఆదివారం నిందితులను జీజీహెచ్ వద్ద అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎస్సై రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.